అతను అల్లా వెళ్లడంతోటే పరదేశిగారు కూడా కోటు తొడుక్కొని, కండువా బుజమ్మీద వేసుకొని తానూ బయలుదేరాడు.

ఆయన తిన్నగా రోడ్డెక్కి కృష్ణవైపు నడిచాడు. ఆయన జేబులలో ఉన్నది, చిల్లరా మల్లరా మూడురూపాయిల పావలా రొఖం, ఒక పోకచెక్క పలుకూ, రెండు లవంగాలూను. డబ్బు లెక్కచూచుకోవడం ఎందుకంటే, ఆయన గృహత్యాగం చెయ్య దలచుకున్నాడు. అయిపోయింది, ఆ విషపు ఘడియ వచ్చేసింది. "ఇంక యీ పెళ్లాం, యీ కొంపా నాకు వద్దు" అని తెగతెంపులు చేసేసుకున్నాడు.

మగవాడు కాదా, ఆవిడనే కొంపలోనుంచి వెళ్లగొట్టకూడదా అని కొందరికి తోచవచ్చును. ఆ మాట ఆయనకున్నూ అనిపించకపోలేదు. కాని, ఆ పనివల్ల ఎంత రభస ఉందో ఆయనకు తెలుసును. ఆ మనిషితో వాగ్వాదం పెట్టుకోవడం ఆయనకు ఎన్నడూ ఇష్టంలేదు. చెయ్యి చేసుకొని, ఆమెను కొంపలోనుంచి యీడ్చి బయటకు గెంటడంవల్ల ఆమె చేసే రభస యినుమడిస్తుందిగాని తగ్గుతుందా? అంత హడావిడి చెయ్యడం, నలుగురినోళ్లా పడడం ఆయనకు సుతరామూ యిష్టంలేదు. అదీగాక, ఈ విషయం యొక్క ఔగాములు, లోతుపాతులు అన్నీ విచారించి తాను చేసుకున్న నిశ్చయం తాను గృహం త్యజించి పోవాలనే కదా. ఆ పనే ఆయన యిప్పుడు చేసేది.

ఆయనకు అవర్ణనీయమైన ఉత్సాహం, సంతోషం కలగవలసిఉండిన్నీ కలుగలేదు. అద్దరిని వాన కురుస్తున్నదికాబోలు, చల్లటి వానగాలి దక్షిణంనుంచి వస్తున్నది. ఆయన విసవిస నడచి వెడుతున్నాడు. ఆబాటబాట తిన్నగా ఇబ్రహింపట్నం వరకు పోయి, అక్కడి రేవుపడవ యెక్కి అద్దరి చేరి, తుళ్లూరుమీదుగా గుంటూరు పోవాలని ఆయనఉద్దేశం. బయలుదేరిన ఒక గంటలోపుగానే ఆయన ఇబ్రహింపట్నం రేవు చేరుకున్నాడు. దారిలో ఎరిగిఉన్నవారు ఎవరూ కనబడలేదు. ఇబ్రహింపట్నంవాళ్లు ఎవరూ ఈయనను ఎరగరు. అందువల్ల ఎవరితోనూ మాట్లాడవలసిన పని లేకుండానే ఆయన రేవువరకు వెళ్లిపోయినాడు. తీరా వెడితే రేవులో పడవ లేదు. అది అవతల గట్టుకు వెళ్లిందట. పడవ ఇవతలకు తోసుకుని రావాలి. ఒక గంటన్నరపైమాట. అక్కడ ఒక తాటి మొదటిలో కూర్చుని ఆయన నదివైపే చూస్తూ ఆలోచిస్తున్నాడు.

"నిజంగా సంసారం అనేది..."

వెనకనుంచి ఈల వినబడింది. మాసిపోయిన పంచె, చాలా మాసిపోయిన వదులుచొక్కా, మాసిన ఉత్తరీయంతో ఒక నల్లటి మనిషి వస్తున్నాడు. వాడు రావడం రావడం పరదేశిగారు కూర్చున్న చోటికి వచ్చి కూర్చుని, "ఎందాకా?" అన్నాడు.

పరదేశిగారు మాట్లాడలేదు.

ఆ మనిషిని ఆయన గుర్తుకు తెచ్చుకున్నాడు. అతడిపేరు పాతగుడ్డల రాఘువాయ. ధాన్యం బేరం, పళ్లబేరం, గొడ్లబేరం, పడవలబేరం ఎన్నెన్నో వృత్తులు చేసిచేసి రాఘవయ్య తుదకు పాతగుడ్డల బేరంలోకి దిగాడు. పాతగుడ్డలిస్తే అల్యూమినం గిన్నెలూ, సోల్డుగోల్డుపిన్నులూ, అద్దాలూ, సబ్బుబిళ్లలూ అవీ ఇస్తాడు. ఆ గుడ్డలు తీసుకుపోయి మళ్ళీ అమ్ముతాడు. మిగిలినది తింటాడు. వాడు తిరగని ఊరు లేదు. ఏటికివతలా అవతలా అన్నిగ్రామాలూ వాడు గాలిస్తుంటాడు. పరదేశిగారు మాట్లాడడం లేదని రాఘవయ్య ఏమీ తగ్గలేదు. "పడవకోసరమా?" అని అడిగాడు. అవునన్నట్లుగా తల ఊపాడు పరదేశిగారు. రాఘవయ్య మరి మాట్లాడలేదు. బొడ్డులోనుంచి కాల్చిన చుట్ట ఒకటి తీసి, నోట్లో పెట్టుకున్నాడు. అది తీరుబడిగా అంటించాడు. కొంతసేపు చుట్ట కాల్చాడు. ఆఖరికి, "అద్దరికా?" అన్నాడు.

పరదేశిగారు మళ్లీ తల ఊపారు.

"అద్దరిని యీ మొగం ఏడా చూడలేదే" అని, "ఏవూరు పోవాల?" అన్నాడు.

పరదేశిగారు, అంత మితభాషీ, "ఒక ఊరేమిటి, ఒక చోటేమిటి" అన్నాడు. రాఘవయ్య కొంచెంసేపు ఊరుకున్నాడు. ఉండి, ఉండి వాడు

